విశాలాంధ్ర కృష్ణా జిల్లా

అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వర్లు జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ స్పందన మీటింగ్ హాల్లో డిఆర్ఓ ముదా విసి రాజ్యలక్ష్మి తో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి పలు ప్రాంతాల ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అనంతరం డిఆర్ఓ అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందన అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. స్పందన అర్జీల పట్ల సానుకూలంగా స్పందించి సకాలంలో పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో డాక్టర్ గీతా బాయి, డిఈఓ తేహెరా సుల్తానా, బీసీ సంక్షేమ అధికారి లక్ష్మీ దుర్గ, సర్వే రికార్డుల ఏడి గోపాలకృష్ణ ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ. సత్యనారాయణ రాజు, ఏపీఎం. ఐ. పీ. పిడి విజయలక్ష్మి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై విచారణచేసి
చట్టపరిధిలో న్యాయంచేస్తాం

విశాలాంధ్ర-మచిలీపట్నం : స్పందనలో సమస్యలతో వచ్చిన ప్రజల వద్ద నుండి స్వయంగా ఫిర్యాదులు జిల్లా ఎస్పీ సోమవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్య ఏదైనా చట్ట పరిధిలో పూర్తిస్థాయి విచారణచేసి, పరిష్కారం అందిం చదానికి కృష్ణా జిల్లా పోలీస్‌శాఖ ఎల్లవేళలా సంసిద్ధంగా ఉంటుందని, సమస్య గురించి దిగులు పడకుండా ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ జాషువా అన్నారు. స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుండి వివిధ రకాల సమస్యలతో వచ్చిన ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, వారి ఫిర్యాదును సానుకూలంగా విని, నిర్ణీత సమయం లోపల చట్టపరిధిలో పరిష్కారం అందిస్తామని హామీ ఇచ్చారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత

వివిధ ప్రభుత్వ శాఖలలో విధులు నిర్వర్తించి మరణించిన ఉద్యోగుల వారసులకు జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు సోమవారం కలెక్టరేట్ స్పందన మీటింగ్ హాల్లో జిల్లా ఎస్పీ పి జాషువా, పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్‌కుమార్‌లతో కలిసి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. మొత్తం 23 మందికి కలెక్టర్ కారుణ్య నియామక పత్రాలు అందజేయగా, 18 మంది జూనియర్ అసిస్టెంట్లుగా, ముగ్గురు ఆఫీస్ సబార్డినేట్లుగా, ఒకరిని స్వీపర్‌గా మరొకరు హార్టికల్చర్‌లో మాలిగా నియామకాలు పొందారు. జూనియర్ అసిస్టెంట్లుగా నియామకాలు పొందిన వారిలో 10 మంది రెవిన్యూ, ఇద్దరు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ శాఖ, 5 మందిని వైద్య ఆరోగ్య శాఖ, ఒక్కరు ఇన్సూరెన్స్ అండ్ మెడికల్ శాఖకు కేటాయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ప్రభుత్వ సర్వీసులో చేరిన మీరందరూ అధికారులు అప్పగించిన విధులు సక్రమంగా ఎంతో నమ్మకంతో అంకితభావంతో పనిచేసి అధికారుల మన్ననలు పొందాలని కలెక్టర్ సూచించారు.

చెత్త సేకరణ కేంద్రాన్ని తొలగించాలని ఫిర్యాదు

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక వాసవి చౌక్ వద్ద గల ఆర్యవైశ్య కళ్యాణ మందిరం పక్కన ఏర్పాటు చేస్తున్న చెత్త సేకరణ కేంద్రాన్ని తొలగించాలని విజ్ఞప్తి చేస్తూ గుడివాడ పట్టణ వైశ్య సంఘం నాయకులు గోకవరపు సునీల్ సోమవారం మచిలీపట్నంలోని కలెక్టర్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమం లో అధికారులకు ఫిర్యాదు చేశారు. గతంలో ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆర్యవైశ్య కళ్యాణమందిరాన్ని అను కొని, పార్కు సచివాలయం ఉన్న చోట, వెంకటేశ్వర స్వామి దేవస్థానం సమీపంలో చెత్త సేకరణ కేంద్రాన్ని ఏర్పాటుతో ఎంతోమంది ఇబ్బందులు పడాల్సి వస్తుందని, తమ మనోభావాలు, ప్రజల ఇబ్బందులను గుర్తించి చెత్త సేకరణ కేంద్రాన్ని తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ విధానాలతో రైతుల ఆత్మహత్యలు

విశాలాంధ్ర-చల్లపల్లి : ప్రభుత్వ విధానాలతో దేశంలో, రాష్ట్రంలో రైతుల ఆత్మ హత్యలు పెరిగాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి అట్లూరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం వక్కలగడ్డ గ్రామ సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంలో ప్రతి రైతు రూ.2.45 లక్షలు రుణభారంతో ఉన్నారని పేర్కొన్నారు. దేశంలో ఆత్మహత్యల్లో మన రాష్ట్రం 3వ స్థానంలో ఉందని, వీరిలో అత్యధికులు పేదరైతులు, కౌలు రైతులేనన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలు ఆశాస్త్రీయంగా ఉన్నాయని, కనీస మద్దతు ధరలకు కూడా రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోలేక పోతున్నారని వాపోయారు. తెలంగాణా ప్రభుత్వ తరహాలో ప్రతి రైతుకు ఎకరాకు రూ.10 వేలు సాగు సాయం అందించాలని డిమాండ్ చేశారు. రెండు ఎకరాల వరకు సాగుచేస్తున్న ప్రతి రైతుకు రూ.20 వేల వరకు పెట్టుబడి సాయం అందించాలన్నారు. రెండు ఎకరాలకు పైబడిన వారందరికి ప్రతి ఎకరాకు రూ.10 వేలచొప్పున సాయం అందించాలని పేర్కొన్నారు. స్వామినాథన్ కమీషన్ సిఫార్సులను అమలు చేయాలన్నారు. రైతు, కౌలు రైతుల అన్ని రకాల పంట రుణాలను రూ.2 లక్షల వరకు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కేరళ తరహా రుణ ఉపశమన చట్టం తేవాలని కోరారు. పెరుగుతున్న వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులను దృష్టిలో పెట్టుకొని అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఉపకరణాలను 90% సబ్సిడీతో అందించాలని విన్నవించారు. 50 సంవత్సరాలు పైబడిన రైతు, కౌలు రైతులకు ప్రతి నెల 50 వేల రూపాయలు ఫింఛన్ అందించాలని పేర్కొన్నారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించాలనే ఆలోచనను ఉపసంహరించుకొని ఉచిత విద్యుత్ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్నారు. భూ యజమాని ప్రమేయం లేకుండానే కౌలు రైతులకు గుర్తింపుకార్డులు జారీ చేయాలని కోరారు. అనంతరం గ్రామ సచివాలయ కార్యదర్శి కి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు హనుమానుల సాయిబాబు, సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి నక్క శ్రీను రైతులు పాల్గొన్నారు.

వెల్లంకిలో సచివాలయ భవనం ప్రారంభం

విశాలాంధ్ర-వీరులపాడు : సుపరిపాలనను ప్రజలకు అత్యంత చేసే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చిందని నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్మోహన్ రావు పేర్కొన్నారు.వీరులపాడు మండలంలోని వెల్లంకి గ్రామంలో 40 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. అనంతరం సచివాలయానికి స్థలాన్ని ఇచ్చిన స్థల దాతలను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మీ, జడ్పిటిసి అమర్లపూడి కీర్తి సౌజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, ఎంపీటీసీ వేమిరెడ్డి కోటేశ్వరి, వేమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, తోట హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్విడేట్‌ను అభివృద్ధి చేయాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : దివి సీమ మనుగడను కాపాడే ఆక్విడేట్‌ను అభివృద్ధి చేసి కాపాడాలని టిడిపి నేతలు నిరసన తెలియచేశారు. మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు ఆద్వర్యంలో సోమవారం పులిగడ్డ ఆక్విడేట్ ను పరిశీలించి నిరసన తెలియచేసి మాట్లాడారు. 1936 వ సంవత్సరంలో బ్రిటీష్ ప్రభుత్వంలో ఆక్విడేట్ నిర్మాణం జరగగా దాని ద్వారా రహదారి మార్గం దివిసీమ ప్రజలకు త్రాగు, సాగు నీటిని అందిస్తుందన్నారు. 1977వ సంవత్సరంలో దివిసీమ గాంధీ మండలి కృష్ణారావు దివిసీమ ప్రజలకు సాగు నీరు సరిపోవడం లేదు అనే ఉద్దేశ్యంతో వేరే ఒక నీటి తొట్టెను కట్టించి దివిసీమ ప్రాంత ప్రజలకు పుష్కలమైన సాగు, త్రాగు నీరు అందింస్తున్నారన్నారు. ప్రతి సంవత్సరం ప్రకృతి వైపరిత్యాలు వస్తునే ఉన్నా ఒక్కోక్క సంవత్సరం కృష్ణానదీ వరద ఉధృతి ఆక్విడేట్ మీదుగా ప్రవహిస్తూ వారం రోజుల పాటు నీరు నిల్వ ఉన్న సందర్భాలు కూడా ఉన్నాయని అటువంటి ఆక్విడేట్‌ను కాపాడుకోవలసిన భాద్యత దివిసీమ ప్రజలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్.పి.టి.సి కొల్లూరి వెంకటేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ ఘంటశాల రాజమోహన్‌రావు, మండల రాంమోహన్‌రావు, బచ్చు రఘునాథ్, దాసినేని శ్రీనివాసరావు, మాదివాడ రత్తయ్య, బర్మా శ్రీను, పులిగడ్డ మాజీ సర్పంచ్ చెన్ను గాంధీ, బిసి నాయకులు లుక్కా శ్రీనివాసరావు, చెన్ను బాబురావు పార్టీ నేతలు పాల్గొన్నారు.

మెకానిక్‌ల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో కుల మతాలకు అతీతంగా ఉపాధి పొందుతూ సహజ అవసరాలను తీర్చేందుకు అగ్రభాగాలు ఉన్న టూ వీలర్స్ మెకానిక్ ల సమస్యలు పరిష్కరించేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని తహసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్‌కు మండలంలోని మెకానికులు స్పందనలో సోమవారం అర్జీ అందజేశారు. మండల మెకానిక్‌ల యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మెకానిక్‌కి ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇవ్వాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : టూ వీలర్ మేకానిక్‌లకు కార్మిక శాఖ ద్వారా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇవ్వాలని పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్‌కు అందచేశారు. సోమవారం అవనిగడ్డ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి అయిన చిమిటి రాజేంద్రప్రసాద్, అవనిగడ్డ మల్లి, మెకానిక్‌లతో కలిసి పలు డిమాండ్‌లతో కూడిన వినతి ప్రతాన్ని అందచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి టూ వీలర్ మెకానిక్ కు కార్మిక శాఖ ద్వారా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇవ్వాలన్నారు. 55 సంవత్సరాలు దాటిన అర్హులైన ప్రతి పేద మెకానిక్ కి వెల్ఫేర్ బోర్డు ద్వారా కనీసం రూ.5 వేలు పింఛన్ సౌకర్యం కల్పించాలని వినతి పత్రంలో కోరారు.

యోగతో మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర-మచిలీపట్నం : జ్ఞాన భిక్షతో పునర్జన్మ నిచ్చి జీవితానికి సార్ధకతనిచ్చే ది గురువులని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి, కొల్లు రవీంద్ర అన్నారు. గురు పూర్ణిమ సందర్భంగా సోమవారం మచిలీపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూచిపూడి నాట్యాచార్యులు, యేలేశ్వరపు పూర్ణచంద్రరావు, యోగ మాస్టరు లు, మద్దాల చింతయ్య, శీలం రాజేష్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు, నటరాజ్ లను మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సత్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువులకు గురువు అయిన వేద వ్యాసుని జన్మదినం ను గురు పూర్ణిమ గా జరుపుకుంటామని ఆయన అన్నారు. భారతీయ సనాతన ధర్మాన్ని పరిరక్షించుకునేందుకు అందరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, కార్పోరేటర్ చిత్తజల్లు నాగరాము, ఎండి ఇలియాస్ పాషా, పి.వి ఫణి కుమార్, చిన్నం శివనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని కూచిపూడి బస్టాండ్‌లో బస్సు ఢీకొనే అక్కడికక్కడే వృద్ధురాలు చనిపోయిన సంఘటన సోమవారం మధ్యాహ్నం జరిగింది. సేకరించిన వివరాలు ప్రకారం కూచిపూడి రైతు బజార్లో కూరగాయలు కొనుక్కొని కోసూరులోని తన ఇంటికి వెళ్లడానికి వస్తున్న బుర్రే కస్తూరిని (65)ని వస్తున్న విజయవాడ నుంచి అవనిగడ్డ వైపు వెళ్ళే ఆర్టీసీ అద్దె బస్సు వెనకనుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాళ్ళకు, తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న కూచిపూడి ఎస్సై డి సందీప్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ నిర్వహించారు. కుమారుడు వరసైన బుర్రి సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు. చనిపోయిన వృద్ధురాలు కస్తూరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా బస్సు డ్రైవర్ జి అనిల్ కుమార్ పోలీసుల అదుపులోఉన్నట్టు సమాచారం.

మెకానిక్‌ల సేవలు అభినందనీయం : మంత్రి జోగి

విశాలాంధ్ర-బంటుమిల్లి : మండలంల్లోని ద్విచక్రవాహన మెకానిక్‌లు చేస్తున్న ప్రజాసేవ కార్యక్రమాలు అభినందనీయమని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ప్రపంచ మెకానిక్‌ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సామవారం బంటుమిల్లి యువగణేష్ మోటర్ వర్కర్స్ అండ్ మెకానిక్‌ల యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పాల్గొని ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ముందుగా మెకానిక్ లందరికి ప్రపంచ మెకానిక్ ల దినోత్సవ శుభాకంక్షాలు తెలిపారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేదల కుటుంబాలలో పుట్టి మెకానిక్ వృత్తిని ఎంచుకుని ఉదయం నుండి సాయంత్రం వరకు కష్టపడి వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటున్న మీ మనసుల్లో నిరుపేద ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసిన యువగణేశ్ మోటార్ వర్కర్స్ అండ్ మెకానిక్ యూనియన్ నాయకులకు, సభ్యులు అభినందనీయులన్నారు. ఉచిత వైద్యశిబిరంలో ప్రజలకు వైద్యాన్ని అందించడానికి వచ్చిన పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు ఆశ్రమం వైద్యకళాశాల, ఆసుపత్రి వైద్యులకు, సిబ్బందికి మంత్రి జోగి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి జడ్పిటిసి మలిశెట్టి వెంకటరమణ, మండలపార్టీ అధ్యక్షులు మలిశెట్టి రాజబాబు, మండలపరిషత్ ఉపాధ్యక్షులు ఒడిమె చిన్నారిబాబు, వైసిపి నాయకులు స్నునం మహేష్, స్నునం సతీష్, మట్ట నాగబాబు, మెకాలిక్ యునియన్ నాయకులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో ప్రజలకు మరింత చేరువ : మంత్రి జోగి

విశాలాంధ్ర-పెడన : పరిపాలన ప్రజలకు మరింత చేరువ చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశమని రాష్ట్ర గృహనిర్మాణశాఖామంత్రి జోగి రమేష్ అన్నారు. పెడన పురపాలక సంఘంలో 4, 5, 6 వార్డులకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం స్థానిక షాదీ ఖానాలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్‌తో కలిసి లబ్దిదారులకు ఆదాయ, కుల, వివాహ ధ్రువీకరణపత్రాలు అందజేశారు. తొలుత 4, 5, 6 వార్డుల పరిధిలో ఎంపికైన 25 మంది వలంటీర్లకు సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర పతకాలు, మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేసి శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వైయస్సార్ భరోసా కార్యక్రమం కింద సూర్యుడు ఉదయించక ముందే తలుపు తట్టి అవ్వ తాతలకు పింఛన్లు అందజేస్తున్న విషయం గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కే డి సి సి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ ఇంచార్జ్ ఎండి ఖాజా, ఫ్లోర్ లీడర్ బల్ల గంగయ్య, మున్సిపల్ కమిషనర్ బీ మహేంద్ర, తాసిల్దారు మధుసూదన్ రావు, కౌన్సిలర్లు రెహంతున్నీసా, మెట్ల గోపీ ప్రసాద్, అబ్దుల్ ఖయ్యుం (బాబులాల్), కో ఆప్షన్ షేక్ మున్నా, టౌన్ పార్టీ అధ్యక్షుడు బందారు మల్లి, సచివాలయ కన్వీనర్, మతీన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అనుకూలంగా వైసీపీ పాలన : దుక్కిపాటి

విశాలాంధ్ర-గుడివాడ : రాష్ట్రంలోని పేద బడుగు బలహీన వర్గాలకు అనుకూలంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వ పాలన సాగుతుందని వైఎస్‌ఆర్సిపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్ అన్నారు. సోమవారం స్థానిక 19వ వార్డులోని సచివాలయా పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ పాల్గొని దరఖాస్తుదారులకు 11 రకాల ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్లు వార్డు నాయకులు గణపతి సుర్గం, పల్లపోతు శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలకు మోక్షం : ఎమ్మెల్యే కైలే

విశాలాంధ్ర-కూచిపూడి : సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన "గడపగడపకు మన ప్రభుత్వం"తో పలు సమస్యలకు మోక్షం లభిస్తుందని పామర్రు శాసనసభ్యులు కైలేఅనిల్ కుమార్ స్పష్టం చేశారు. మొవ్వ మండలం కాజగ్రామంలో సోమవారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల వినియోగం పలు పథకాలను ప్రవేశపెట్టి వారి బాగోగులపై ప్రత్యక్షంగా పరోక్షంగా శ్రద్ధ చూపిస్తున్న ముఖ్యమంత్రిని రెండోసారి అధికారంలోకి తీసుకు రావడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించి సైనికుల్లా పనిచేసే కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో జరిగే జగనన్న సురక్షని ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని వాలంటీర్లకు హితవుపలికారు. మండలంలోని వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులతో పాటు ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పిటిసి రాజులపాటి పార్వతి, సర్పంచ్ కొడాలి భవానీ, ఉపసర్పంచ్ మంద శ్రీనివాసరెడ్డి, ఎంపీ టి సి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధర్మ చక్ర పరివర్తనతోనే వ్యక్తిత్వ వికాసం : దమ్మదజ పూజ్య బంతేజి

విశాలాంధ్ర-ఘంటసాల: ధర్మ చక్ర పరివర్తనతోనే వ్యక్తిత్వ వికాసం లభిస్తుందని దమ్మదజ పూజ్య బంతేజీ పేర్కొన్నారు. మండల కేంద్రమైన ఘంటసాల ప్రముఖ బౌద్ధ క్షేత్రం వద్ద పూజ్య బంతేజి ఆధ్వర్యంలో ధర్మచక్ర పరివర్తన దినాన్ని ఘనంగా నిర్వహించారు. పూజ్య బంతేజి మాట్లాడుతూ బుద్ధుడు జ్ఞానోపదేశం పొంది 5 గురు శిష్యులకు తొలి ధర్మోపదేశం ఇచ్చిన రోజు ధర్మ చక్ర పరివర్తన దినం అన్నారు. ముందుగా ఘంటసాల బౌద్ధ స్తూపం వద్ద బౌద్ధ గురువు బాల బాలికలకు ధర్మోపదేశం చేసారు. వ్యక్తిత్వ వికాసములో భాగముగా బుద్ధ భగవాన్ చెప్పిన ధ్యాన్యం , యోగం నేర్పించి ప్రతిభ కనపరిచిన బాల బాలికలకు బహుమతులు అందించి , అల్పాహార వితరణ చేసారు. ఈ కార్యక్రమం జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ , గొర్రెపాటి ట్రస్ట్ నిర్వాహకులు గొర్రెపాటి చంద్రశేఖరావు , చుండూరి ప్రసాద్ , ఘంటసాల హై స్కూల్ డ్రిల్ మాస్టర్ పిచ్చేశ్వరావు , గణేష్ , గోపాలకృష్ణ (మ్యూజియం సిబ్బంది) పలువురు పాల్గొన్నారు.

రైలు కింద పడి ఆత్మహత్య..!

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి అత్మహత్య చేసుకున్నట్లు జి.ఆర్.పి సిఐ పి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు.ఆయన తెలిపిన వివరాలు ప్రకారం రైల్వేస్టేషన్ 1వ నెంబర్ ప్లాట్‌ఫామ్ రైల్వేట్రాక్ వద్ద సుమారు 45 సం.లు వయస్సు గల వ్యక్తి సికిద్రాబాద్ నుండి మచిలీపట్నం వెళ్ళుతున్న ఎక్స్‌ప్రెస్ క్రింద తలపెట్టి అత్మహత్య చేసుకున్నాడు. మృతుడు 5.5అడుగులు ఎత్తుతో ఎరుపు ఛాయ రంగు కోల ముఖం కలిగి ఉన్నాడు.శరీరంపై నీలం,నలుపు,పచ్చ రంగులతో గళ్ళ హాఫ్‌హ్యాండ్ షర్టు, సిమెంట్ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు.కుడి చేతిపై డి.జి.ఎల్ అనే పచ్చబొట్టు ఉంది.అంతకుమించి అధారాలు లభ్యంకాలేదు .వివరాలు తెలిసినట్లయితే రైల్వే పోలీస్ స్టేషన్‌లో గాని, 9440627544, 0866-2576006 సంప్రదించాలని కోరారు.

ముస్తాబాద్ స్టేషన్ నుండి రాకపోకలు పునరుద్ధరించాలి

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం మండలం ముస్తాబాద్ గ్రామంలో ప్రతి రోజు ముస్తాబాద్ నుండి తాపీ, వడ్రంగి చేతి పనులు చేసుకోవటాని 2 వేల మంది వెళ్తున్నారు. అలాగే జగనన్న కాలనీలు రైల్వేస్టేషన్ వద్ద విజయవాడ వాసులకు సుమారు 7 వేలు మందికి కాలనీ ఇల్లు నిర్మిస్తున్నారు. వాళ్ళందరి రాకపోకలు ముస్తాబాద్ రైల్వేస్టేషన్ నుండి వెళ్తున్నారు. కావున రైల్వే స్టేషన్ నుంచి రాకపోకలు కాలనీవాసులకు పునర్దించాలని వైసీపీ కో కన్వీనర్ బందారుపల్లి కోటేశ్వరరావు సోమవారం కోరారు. పురాతన పేరు గాంచిన ముస్తాబాద్ రైల్వే స్టేషన్ను రాకపోకలు జరపాలని గ్రామస్తులు కోరుతున్నారని అన్నారు.

రాయలసీమకు అన్యాయం : బైరెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : జగన్ ముఖ్యమంత్రి అయ్యాకే రాయలసీమకు అత్యంత అన్యాయం జరిగిందని రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అరోపించారు నీళ్లు, నిధులు, నియామకాల్లో సమాన వాటా కోసం ఈనెల 28న చలో దిల్లీ చేపడుతున్నట్లు తెలిపారు.సోమవారం విజయవాడలో ఉన్న హోటల్ ఐలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అని ఓటు వేయించుకున్న జగన్ సీమకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర విభజన తరువాత ఎపికి అడుగడుగునా అన్యాయం జరుగుతుందన్నారు. ఉమ్మడి ఎపిలో రాయలసీమ ప్రాంతం వారు సిఎం లు పని చేశారు అయినా నేటికీ రాయలసీమలో తాగు నీరు లేని పరిస్థితి నదులు ఉన్నా నీళ్లు ఉన్నా.. రిజర్వాయర్లు లేవు అన్నారు. బిటీష్ వారు కట్టిన డ్యామ్ వల్లే ఇప్పటికి నీరు అందుతుందన్నారు. అనాడు కర్నూలు రాజధానిగా పెట్టి మళ్లీ హైదరాబాద్ తరలించారు ఇప్పుడు ఈ సిఎం న్యాయ రాజధాని పెడతా అంటున్నారు ఇంతకంటే అన్యాయం మరొకటి లేదు అన్నారు.సంగమేశ్వర ప్రాజెక్టు కట్టి ఉంటే 24 లక్షల ఎకరాలకు నీరు లభించేది.రాయలసీమ నాయకులు మా ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేశారన్నారు.మా దగ్గర ఉన్న ఖనిజ సంపద మరెక్కడా లేదు ఐరన్ ఓర్, బైరైటీస్, మైనింగ్ కొల్లగొట్టుకు పోతున్నారన్నారు. ప్రక్క రాష్ట్రం వాళ్లు వచ్చి ఇక్కడ పెత్తనం చేస్తున్నారు స్థానిక యువతకు అన్యాయం చేసేలా బయటి వారికే ఉపాధి లభిస్తుందన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయడం తప్ప తండ్రి, కొడుకులు చేసిందేమీ లేదు ఇప్పుడు అయిన మా పోరాటానికి జగన్ ఢిల్లీ వచ్చి మద్దతు ఇవ్వాలన్నారు. ఛలో ఢిల్లీ తరువాత రాయలసీమ రాజకీయాలు మారతాయి శ్రీభాగ్ ఒప్పందం ప్రకారం సమానమైన సీట్లు ఉండాలి అన్నారు.రాష్ట్రంలో ఆర్థిక కష్టాలు, అదుపు తప్పిన లా అండ్ ఆర్డర్, పెరుగుతున్న నిరుద్యోగం ఇలా ఎన్నో విధాలా నాశనం చేశారన్నారు.

టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుచేయాలి

విశాలాంధ్ర-చల్లపల్లి : రాష్ట్ర ప్రభుత్వం టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుచేయాలని మెకానిక్లు నినదించారు. కార్మికశాఖ ద్వారా ప్రతి మెకానిక్కు గుర్తింపు కార్డు ఇవ్వాలనీ, 55 సంవత్సరాలు దాటిన అర్హులైన పేద మెకానిక్లకు వెల్ఫేర్ బోర్డు ద్వారా ప్రతినెలా ఫించన్ ఇవ్వాలనీ కోరారు. జాతీయ మెకానిక్ దినోత్సవాన్ని సోమవారం చల్లపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న చల్లపల్లి ఉపసర్పంచ్ ముమ్మనేని నాని మెకానిక్లను సత్కరించి, కేక్ కట్చేశారు. అనంతరం చల్లపల్లి పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. మెకానిక్అ సమస్యల పరిష్కారం కోరుతూ చల్లపల్లి తహసీల్దార్ కె.గోపాలకృష్ణకు మెకానిక్లు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నేతలు షేక్ నబీఘోరీ, ఉస్మాన్ షరీఫ్, చల్లపల్లి మండల నేతలు కొల్లూరి ప్రేమ చంద్, టి.చంద్రశేఖరరావు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : "మెకానిక్ డే "సందర్భంగా సోమవారం మొవ్వ పీహెచ్సీలో చికిత్సలు పొందుతున్న రోగులకు మండలంలోని మెకానిక్ లు పండ్లు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు సైతం పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ పి హెచ్ సి లోని వైద్యాధికారులైన డాక్టర్ ఎం వేద రాజ్, డాక్టర్ సిహెచ్ రాజేశ్వరి లను పుష్పగుచ్చాలతో అభినందించి పండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి, పెదపూడి, మొవ్వ, కోసూరు, కాజ,నిడుమోలు తదితర ప్రాంతాలలోని 50 మందికి పైగా మెకానికులు పాల్గొన్నారు.

జెఈఈలో ఫిట్జి విజయం

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్ : ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఫిట్జి విజయవాడ సంస్థ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ మేనేజింగ్ పార్టనర్ పిన్నెపు రమేష్ బాబు మాట్లాడుతూ ప్రతి విద్యా సంవత్సరంలో జేఈఈ ఫలితాల్లో తమ సంస్థ గొప్ప విజయాలను సాధిస్తుందని తెలిపారు. ఈ పరంపరలో ఈ సంవత్సరం ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో భాగంగా ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో తమ విద్యార్థి కారెడ్ల బాలాజీ 55వ ర్యాంకును సాధించడం గర్వకారణం అని అభినందించారు. ఈ సందర్భంగా సంస్థ తరపున 36లక్షలు నగదు రివార్డ్ అందజేస్తున్నామని ప్రకటించారు. ఐఐటీ ముంబాయి కంప్యూటర్ సైన్స్ విభాగంలో సీటు సాధించాలని తెలిపారు. ఈ నగదు మరింత ఉన్నత విద్యకు దోహద పడుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం 100కు పైగా ఐఐటీ సీట్లు సాధించి వివిధ రంగాల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ముంబాయిలో జరిగిన ఒలింపియాడ్ సిస్టంలో ఇండియా తరుపున 5గురు విద్యార్థులు ఎంపిక కాగా అందులో ఫిట్జి సంస్థ విద్యార్థి కోడూరి లేజశ్వర్ ఒకరిని తెలిపారు.ఆగస్టులో పోలెండ్ లో జరిగే అంతర్జాతీయ ఫైనల్ సెలక్షన్ లో గోల్డ్ మెడల్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంఈఓగా 'పద్మారాణి'

విశాలాంధ్ర-పమిడిముక్కల: మండలంలో గత కొన్ని సంవత్సరాలుగా ఎంఈఓ ఇన్చార్జి పాలనతోనే కొనసాగింది. ఇటీవల ఎంఈఓ-2గా ఎస్.శ్రీనివాస్ నియమించారు. ఐ.పద్మరాణి అంగలూరు బాలికల పాఠశాల హెచ్ఎంగా, ఉయ్యూరు ఇన్చార్జి ఎంఈఓగా కొనసాగుతూ బదలీపై పమిడిముక్కల మండల విద్యా శాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

ఎకరానికి రూ.10వేలు సాగు సాయం ఇవ్వాలి

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య

విశాలాంధ్ర-విజయవాడ : తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న మాదిరిగా మన రాష్ట్రంలో రైతులు, కౌలురైతులు సాగు చేస్తున్న ప్రతి ఎకరానికి రూ.10వేలు సాగు సాయం అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలులో భాగంగా సోమవారం ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం కవులూరు గ్రామ సచివాలయం కార్యదర్శి రామచంద్రకి, విజయవాడ రూరల్ మండలం పైడూరుపాడు గ్రామ సచివాలయం వీఆర్ఓ సత్యవతికి సంఘం నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పి.జమలయ్య కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల ప్రతి కుటుంబం రూ.2.45లక్షల రుణ భారంతో ఉందని, దేశంలో జరుగుతున్న ఆత్మహత్యల్లో మన రాష్ట్రరైతాంగం మూడో స్థానంలో ఉన్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే రైతు భరోసా పావు ఎకరానికి కుడా పెట్టుబడికి చాలదన్నారు.ఈ నేపథ్యంలో రైతులను, కౌలురైతులను వ్యవసాయంలో నిలుపేందకు, రుణభారం నుండి రైతాంగాన్ని విముక్తి చేసేందుకు ప్రతి ఎకరానికి రూ.10వేలు వంతున సాగు సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాగు సాయం పథకాన్ని కౌలురైతులకు వర్తింప చేయాలని,సాగు సాయంతో పాటు కేరళ తరహాలో రుణ ఉపశమనం చట్టం తేవాలని,ఒక పర్యాయం రైతుల,కౌలురైతుల పంట రుణాలు మాఫీ చేయాలని కోరారు. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల సూచనల మేరకు సి2+50 శాతం కలిపి మద్దతు ధరలు ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని, రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, సూక్ష్మ పోషకాలు 90శాంతం రాయితీపై ఇవ్వాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగించే విధానానన్ని స్వస్తి పలకాలని, 50 సంవత్సరాలు పైబడిన ప్రతిరైతుకు, కౌలురైతుకు ప్రతినెల రూ.10వేలు పించను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా నాయకులు బుడ్డి రమేష్,పెయ్యల వెంకటేశ్వరరావు,గ్రామ రైతుసంఘం నాయకులు కోయసుబ్బారావు,గరిమెళ్ళ సూర్యానారయణ, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, చెరుకూరి వెంకటనారయణ, గరిమెళ్ళ లింగయ్య, కొడే సాంబశివరావు, పెయ్యల వెంకటేశ్వరరావు, పెయ్యల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

తిరువూరులో...

తెలంగాణ ప్రభుత్వ తరహాలో రాష్ట్రంలో ప్రతి రైతుకు ఎకరాకు రూ.10వేల పంట సాగు సాయం అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని ఎర్రమడు గ్రామ సచివాలయంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎర్రమడు సచివాలయంలో అవులూరు సత్యనారాయణరెడ్డికి సంఘ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫార్సు మేరకు భూ యజమానులతో సహా రైతులు, కౌలు రైతులకు రూ.2 లక్షల వరకు రైతు రుణాలు రద్దు చేయాలన్నారు. ప్రతి ఏటా పెట్టుబడి పెరుగుతున్నందున రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు 90 శాతం సబ్సిడీతో అందజేయాలని కోరారు. 50 సంవత్సరాలు పైబడిన రైతులకు నెలకు రూ.10వేల పింఛన్ అందించాలని, వ్యవసాయ మోటార్లకు (పంపులకు) స్మార్ట్ మీటర్లు బిగించాలన్న ఆలోచన ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, భూ యజమాని ప్రమేయం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిలుకూరు వెంకటేశ్వరావు, తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కె నాగుల్‌మీరా, మండల వ్యవసాయ రైతు సంఘం నాయకులు నృసింహాద్రి వనమాలి తదితరులు పాల్గొన్నారు.

కోనేరు రంగారావు భూకమిటీ సిఫారసులు అమలు చేయాలి

కోనేరు రంగారావు భూకమిటీ సిఫారసులు అమలు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు ఆగస్టు నెలలో బాపట్లలో జరుగనున్న నేపథ్యంలో జిల్లా గ్రామీణ శ్రమజీవుల సభ్యత్వ నమోదు కార్యక్రమం గత వారం రోజులుగా విస్తృతంగా సాగుతోంది. సోమవారం మండలంలోని గ్రామాల్లో పర్యటించిన చిలుకూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గ్రామలో సంఘాలను బలోపేతం చేస్తున్నామన్నారు. వ్యవసాయ కార్మికులకు ఒక్కో పేద మధ్య తరగతి వర్గాల కుటుంబాల ఆధీనంలో ఉన్న అన్ని రకాల సాగుభూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. కోనేరు రంగారావు సిఫారసు మేరకు ప్రతి రైతు కుటుంబానికి రెండున్నర హెక్టార్ల సాగు భూమి ఇవ్వాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని, రెండు పూటల పని విధానాన్ని రద్దు చేయాలని, రోజువారీ కూలీ రూ 600 చెల్లించాలని, ఏడాదిలో 200 పని దినాలు కల్పించాలని, ప్రతి కూలీ కుటుంబానికి గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున నివేశన స్థలాలు పంపిణీ చేయాలని, జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని, కాలనీల్లో విద్యుత్, తాగు నీరు, రహదారుల అభివృద్ధి, డ్రైనేజీలు నిర్మాణం యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కె నాగుల్‌మీరా, టౌన్ సెక్రెటరీ ఉదయ్ మాలపాటి తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో...

తెలంగాణ ప్రభుత్వ తరహాలో ప్రతి రైతుకు ఎకరానికి రూ.10 వేలు సాయం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం రామిరెడ్డిపల్లి సచివాలయ కార్యదర్శి రవికి సోమవారం వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా కో కన్వీనర్ చుండూరు వెంకట సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల కారణంగా రాష్ట్రంలో ప్రతి రైతు 2.45 లక్షల రూపాయల రుణభారంతో ఉన్నారన్నారు దేశంలో రైతుల ఆత్మహత్యల లో మన రాష్ట్రం మూడవ స్థానంలో ఉందన్నారు వీరిలో అత్యధికులు పేద రైతులు కౌలు రైతులే అన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలు అశాస్త్రీయం గా ఉన్నాయని కనీస మద్దతు ధర లకు కూడా రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోలేక పోతున్నారని అన్నారు తెలంగాణ రాష్ట్ర తరహాలో ప్రతి రైతుకు ఎకరాకు పదివేల రూపాయలు సాగు సాయం అందించాలన్నారు. రెండు ఎకరాల వరకు సాగు చేస్తున్న ప్రతి రైతుకు 20 వేల వరకు పెట్టుబడి సాయం అందించాలన్నారు రెండు ఎకరాలు పైబడిన వారందరికీ ప్రతి ఎకరాకు 10000 చొప్పున సాయం అందించాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం(సి2ం50) అమలు చేయాలని రైతు, కౌలు రైతుల అన్ని రకాల పడ్డ రుణాలను రెండు లక్షల రూపాయల వరకు మాఫీ చేయాలని కేరళ తరహా రుణ ఉపశమన చట్టం తేవాలని డిమాండ్ చేశారు పెరుగుతున్న వ్యవసాయ ఖర్చులను దృష్టిలో పెట్టుకొని అన్ని రకాల ఎరువులు విత్తనాలు పురుగుమందుల ఉపకరణాలను 90 శాతం సబ్సిడీతో అందించాలని డిమాండ్ చేశారు.50 సంవత్సరాలు పైబడిన రైతు, కౌలు రైతులకు ప్రతినెల పదివేల రూపాయలు పించను అందించాలని గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్ల బిగించాలనే ఆలోచనను ఉపసంహరించుకోవాలని ఉచిత విద్యుత్ కొనసాగించాలని డిమాండ్ చేశారు భూ యజమాని ప్రమేయం లేకుండానే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని పై వ్యవసాయ పథకాలన్నీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. జులై 10,11 తేదీల్లో మండల కేంద్రాల్లో రైతులను, కౌలు రైతులను సమీకరించి ఇక దీక్షలు చేపట్టనున్నట్లు జూలై 17, 18, 19 తేదీలలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. జులై 26 నుండి 30వ తేదీ వరకు విజయవాడ కేంద్రంగా సామూహిక రైతు దీక్షలు జులై 31 నుండి నిరవధిక దీక్షలు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు హైదరాబాద్కు దీక్షలో అన్ని జిల్లాల రైతు సంఘాలు కార్యదర్శులు జిల్లా కమిటీ సభ్యులు పాల్గొనాలని కోరారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అబ్బూరి చిన్న రాముడు, వీర ప్రకాష్ రావు, పుల్లయ్య, ముసలయ్య, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

దంపింగ్‌యార్డ్‌ను తరలించండి

తరలించకపోతే ప్రజా ఉద్యమం చేపడతాం

మునిసిపల్ అధికారులకు దోనేపూడి శంకర్ హెచ్చరిక

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : స్థానిక ముక్త్యాల రోడ్డులో విలియంపేట సమీపంలోని మున్సిపల్ డంపింగ్ యార్డ్‌ను సీపీఐ బృందం పరిశీలించింది. ఈ డంపింగ్ యార్డ్‌తో చుట్టుపక్కల ప్రజలు తీవ్ర అసౌకర్యాన్నికి గురౌతున్నారని, డంపింగ్‌యార్డ్‌లో చెత్తా చెదారాన్ని తగలబెట్టడంతో పొగమబ్బు కమ్ముకొని వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనెపూడి శంకర్ మున్సిపల్ తీరుని విమర్శించారు. ఇప్పటికే జగ్గయ్యపేట మున్సిపల్ 31 వార్డుల నుండి సుమారు 30 టన్నుల పైన చెత్తను సేకరించి, ఈ డంపింగ్ యార్డ్‌లో మున్సిపల్ వారు పోస్తున్నారని ఆయన అన్నారు. మున్సిపల్‌పాలక పక్షం తడి చెత్త మరియు పొడి చెత్తలను వేరు చేయకుండానే చెత్తను ఈ ప్రాంతంలో పోస్తున్నారని ఆయన అన్నారు. ఇప్పటికే ఇటువంటి చెత్త సేకరణతో పాలేరు నది కలుషితం అవుతుందని ఆయన అన్నారు. దీనితో ప్రజల ఆరోగ్య సమస్యలపై ప్రభావం పడుతుందని ఆయన అన్నారు. ప్రజలు కూడా డంపింగ్ యార్డ్‌ని తరలించాలని ఆందోళన చేసారని ఆయన మున్సిపల్ వారికి గుర్తుచేశారు. వెంటనే జగ్గయ్యపేట మున్సిపల్ వారు డంపింగ్‌యార్డ్‌ను ఈ ప్రాంతం నుండి తరలించాలని, లేని పక్షంలో డంపింగ్ యార్డ్‌ను తరలించేంత వరకు ప్రజల పక్షాన సీపీఐ ఆందోళన చేస్తోందని ఈ సందర్భంగా ఆయన మున్సిపాలిటీని హెచ్చరించారు. ఈ సందర్భంగా సీపీఐ జగ్గయ్యపేట పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుదామని మున్సిపల్ తెలియజేస్తూ, పాలేరు నదిని సైతం కలుషితం డంపింగ్‌యార్డ్‌తో కలుషితం చేస్తూ, పాలేరులో ఉన్న నీటి బావులతో పట్టణ ప్రజలకు అందుతున్న తాగునీరు కలుషితం అవ్వడంతో నీరు మురుకులుగాను, దుర్వాసన గాను కొన్ని ప్రాంతాలల్లో వస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా మున్సిపల్ వారు తడి, పొడి చెత్తలను వేరు వేరుగా సేకరించాలని, ప్రజలకు అసౌకర్యంగా ఉన్న డంపింగ్ యార్డును ఊరి దూరంగా తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పోతుపాక వెంకటేశ్వర్లు, మాశెట్టి రమేష్, భోగ్యం నాగులు, రాణి, మెటికల శ్రీనివాసరావు, షేక్ జాని తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ వెండి తాపడానికి రూ.1.116 లక్షల విరాళం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలోని అంకమ్మ అమ్మవారి దేవాలయం వెండి తాపడం తయారికీ పెనుగంచిప్రోలు గ్రామ వాస్తవ్యులు పచ్చల సునీల్‌కుమార్, త్రివేణి దంపతుల కుమారుడు జయంతి సాయి రూ.1.116 లక్షల చెక్కును అందజేశారు. ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు ధర్మకర్తలు కోలా రామారావు, కర్ల వెంకటేశ్వర్లు, ఆలయ కార్యనిర్వహణ అధికారి, డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్‌నాయుడుకు అందజేశారు. వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ ఆలయ అర్చకులు వేద పండితులచే ఆశీర్వచనం చేసి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

తిరుపతమ్మ ఆలయం నుండి కనకదుర్గమ్మకు సారె

తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం తరపున విజయవాడలోని దుర్గా మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం ఇంద్రకీలాద్రి దుర్గమ్మవారికి ఆషాడ మాసం సందర్భంగా సుమారు 14 కిలోమీటర్లు గిరిప్రదక్షిణచేసి సాంప్రదాయ పద్ధతిలో సారే సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్, కార్యనిర్వహణాధికారి కే రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ధర్మకర్తల మండలి సభ్యులు పూజారులు, వేదపండితులు, దేవస్థానం సిబ్బంది సేవా సమితి వారు దుర్గ అమ్మవారికి సారె సమర్పించిన్నారు.

బార్ అసోసియేషన్ విధులు బహిష్కరణ

విశాలాంధ్ర-నందిగామ: నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం గుడివాడ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి శ్రీనివాసులు పై గుడివాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో అక్రమంగా ఫాల్స్ కంప్లైంట్ తీసుకొని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినందుకుగాను కోర్టు విధుల బహిష్కరణ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బండి మల్లికార్జునరావు, వైస్ ప్రెసిడెంట్ బి భాస్కరరావు బార్ అసోసియేషన్ కార్యదర్శి పి ప్రకాష్ మరియు సీనియర్ న్యాయవాదులు కన్నె కంటి జీవరత్నం, మన్నెం నారాయణ రావు, ఎర్రమరెడ్డి బాబు రావు, షేక్ కరీముల్లా , బొందలపాటి రామకృష్ణ, ఎస్పీ జాఫర్, దాదా హుస్సేన్, డి కోటేశ్వరరావు, దారెల్లి అరుణ్ కుమార్, షేక్ ఆజాద్, బి సురేష్, వరద బోయిన విజయ్ కుమార్, మందా వజ్రయ్య తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

అనధికార లే అవుట్లు, కట్టడాలపై చర్యలు

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : పట్టణంలో అనధికార లేఅవుట్లు మరియు అనధికార కట్టడాలపై సోమవారం టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో రివ్యూ సమావేశాన్ని మునిసిపల్ కమిషనర్ సిహెచ్. మల్లేశ్వరరావు ఏర్పాటు చేసారు. సదరు సమావేశం నందు పట్టణ పరిధిలో అనధికార కట్టడాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మరియు అనధికార లేఅవుట్ లపై కేసులు ఫైల్ చేయుట ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకోవలసినదిగా ఆదేశములు జారీచేసారు. పట్టణం నందు ప్లాట్లు కొనుగోలు చేయు వారు ఎల్ పి నెంబర్లు, సి ఆర్ డి ఏ వారి అనుమతి ఉన్నది, లేనిదీ పరిశీలన చేసుకొని కొనుగోలు చేసుకొనవలసినదిగా తెలిపారు . అనుమతులు పొందని అనధికార లేఅవుట్ నందు ప్లాట్లు కొనుగోలు చేసిన యెడల రిజిస్ట్రేషన్ సమయం నందు, ప్లాన్లు ఆమోదములో ఇబ్బందులు ఎదుర్కొనవలసి ఉంటుందని తెలిపారు . అదేవిధంగా అనధికార లేఅవుట్ నందు ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయుట నిలుపుదల చేయవలసినదిగా సబ్-రిజిస్ట్రార్, జగ్గయ్యపేట వారికి లేఖ పంపవలసినదిగా టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసారు.

విద్యాసంస్థలలో అధిక ఫీజులు అరికట్టాలి

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): అనుమతులు లేకుండా నడుస్తున్న విద్యాసంస్థలుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎం సాయి కుమార్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీ రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం. సాయికుమార్, ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు, కార్యదర్శి సి.హెచ్. వెంకటేశ్వరరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజేష్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజుల వాత, విద్యార్థులకు పుస్తకాల మోత, తప్పడం లేదున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులకంటే ఏ మాత్రం ఎక్కువ వసూలు చేయరాదని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ మంత్రి పదేపదే హెచ్చరిస్తున్నా, కొన్ని సంస్థలకు నోటీసులు జారీ చేస్తున్నా, ఇవేమీ తమకు పట్టనట్టుగా కొన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు, ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. కొన్ని యాజమాన్యాలు అయితే గత ఏడాది కన్నా ఇప్పటికీ ఫీజులు రెట్టింపు చేశాయని తెలిపారు. మరికొన్ని చోట్ల రెండు, మూడు రెట్లు ఫీజులు పెంచేసికున్నాయన్నారు. ఈ దోపిడీ ఎల్‌కేజీ నుండే ఆరంభమవుతున్నదనీ, లక్షలాది రూపాయలు వసూలు చేసే పాఠశాలలు పుట్టు కొచ్చాయనీ, పిల్లలనే కాదు వారి తల్లిదండ్రులను కూడా ఆర్థిక స్థోమతలను అంచనా వేసుకొని సీట్లు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వ నిబంధనలకులోబడే తాము సీట్లు కేటాయిస్తున్నట్లు నామమాత్రపు రసీదులు ఇస్తున్నారనీ, ఈదోపిడీని భరించలేక, అడిగిన ఫీజులు కట్టలేక, కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు పడుతున్న ఆవేదన అంతా ఇంతా కాదన్నారు. గత ఏడాది కూడా ఈ పరిస్థితి ఉండడంతో కొందరు తల్లిదండ్రులు ఆందోళనకు దిగారని గుర్తు చేశారు. నిర్దిష్టమైన ఆరోపణలతో ఏయే యాజమాన్యాలు ఎంతెంత ఫీజులు వసూలు చేస్తున్నారో, సమగ్ర వివరాలతో ఫిర్యాదులు చేసినా కూడా, చర్యలు తీసుకోలేదుని తెలిపారు . అధిక ఫీజులు దోపిడీ పై విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగర నాయకులు చందు, సుధీర్, రంజిత్, నాగేంద్ర, ఎస్ఎఫ్ఐ నాయకులు కుమారస్వామి, పీడీఎస్‌యూ నగర నాయకులు పృథ్వి, రాజకుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

6న ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - విజయవాడ(చిట్టినగర్): ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు లంకా గోవింద రాజులు, నగర సహాయ కార్యదర్శి బెవర శ్రీనివసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం హనుమాన్ పేటలోని దాసరి నాగభూషణరావు భవనంలో ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్స్ విడుదల చేశారు. ధర్నా కార్యక్రమంలో నిరుద్యోగ యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆర్‌బీకే కేంద్రాల్లో ఖాళీగా ఉన్న యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్ పోస్టులు(ఏహెచ్‌ఏ) భర్తీ చేయాలని, గ్రూప్ 1,2, పోస్టులు భర్తీ చేయాలని, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 50 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి చర్యలు తీసుకుని, ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని, ఎస్సై, కానిస్టేబుల్ రిలీఫ్ పరీక్షల్లో అర్హత పొందిన అభ్యర్థులకు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ, మెటీరియల్ అందించాలనీ, ఉద్యోగాలు ఇవ్వలేని పక్షంలో ప్రతి నిరుద్యోగికి నిరుద్యోగ భృతి నెలకు 10వేలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి ఎం సాయికుమార్, అయ్యప్ప, సుధీర్, శ్రీనాథ్, నాగేంద్రబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో

రైతు దినోత్సవ వేడుకలు

-ఉత్తమ రైతులకు 54మందికి రూ.10 వేలు నగదు పురస్కారాలు

విశాలాంధ్ర-విజయవాడ : కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ వారి ఆధ్వర్యంలో రైతు దినోత్సవాన్ని నిర్వహిస్తుందని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జులై 5 బుధవారం విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య భవనం నందు ఉదయం 10 గంటలకు కేడీసీసీ బ్యాంక్ నేతృత్వంలో మొట్టమొదటిసారిగా రైతు దినోత్సవ వేడుకలు జరపనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ప్రతి మండలం నుంచి ఉత్తమ రైతులను వ్యవసాయ శాఖ ద్వారా ఎంపిక చేసి 54 మంది రైతులకు ఒక్కొక్కరికి పదివేల చొప్పున నగదు పురస్కారం, మెమెంటో, సర్టిఫికెట్ ఇవ్వనన్నట్లు చెప్పారు. జులై 8 దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం రైతు దినోత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో ఉచిత విద్యుత్, జల యజ్ఞం, రైతు రుణమాఫీ ద్వారా రైతాంగం గుండెల్లో చెరగని ముద్ర వేసి, వ్యవసాయం దండగ కాదు పండగ అని చాటిచెప్పిన డాక్టర్ వైయస్సార్ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మాత్యులు జోగి రమేష్, వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ యం వి యస్ నాగిరెడ్డి, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ మల్లాది విష్ణు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. రైతులు, సహకార సంఘ అధ్యక్షులు మరియు సిబ్బంది విరివిగా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు కోరారు.

'బాడీకేర్ కిడ్స్' నయా సమ్మర్ కలెక్షన్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ : పిల్లల కోసం బాడీకేర్ కిడ్స్ నయా సమ్మర్ కలెక్షన్ ఆవిష్కరించినట్లు బాడీకేర్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ డైరెక్టర్ మిథున్ గుప్తా తెలిపారు. ఈ ఎండల్లో పిల్లలకు ఆహ్లాదకరమైన వార్డ్‌రోబ్‌ను అందిస్తుందన్నారు. మునుపటి సేకరణల నుంచి కాకుండా బాడీకేర్ కిడ్స్ కొత్త వేసవి సేకరణ మరింత విస్తృతమైన రంగులు, జోడిరచిన క్యారెక్టర్ ప్రింట్లు, తాజా డిజైన్‌లను అందిస్తుందని పేర్కొన్నారు. ఇది 450 కంటే ఎక్కువ పంపిణీదారుల వద్ద, 19 వేల కంటే ఎక్కువ రిటైల్ స్టోర్‌లలో..భారతదేశం అంతటా 20పైగా ప్రత్యేకబ్రాండ్ అవుట్‌లెట్‌లలో (ఈబీవో) అందుబాటులో ఉన్నాయన్నారు. పెప్పాపిగ్, బేబీషార్క్, డిస్నీ, హలోకిట్టి, కార్టూన్ నెట్‌వర్క్, మార్వెల్ నుంచి ప్రియమైన పాత్రలను కలిగి ఉన్న క్యారెక్టర్ ప్రింట్‌లతో సహా వివిధ ప్రింట్‌లతో కూడిన రంగురంగుల టీ-షర్టులు ఉన్నాయన్నారు. బాడీకేర్ కిడ్ డెనిమ్స్, స్పోర్ట్స్‌వేర్ అనే రెండు రకాల్లో ట్రెండీ డిజైన్లు అందుబాటులో వుంటాయన్నారు.

మహిళా చైతన్యంతోనే ప్రగతి

విశాలాంధ్ర-విజయవాడ : మహిళలు చైతన్యవంతంగా పని చేస్తేనే సమాజం ప్రగతిపథంలో పయనిస్తుందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని అన్నారు. నక్కా రాజ్యలక్ష్మి అధ్యక్షతన మహిళా సమాఖ్య 36వ డివిజన్ ప్రథమ మహాసభ జరిగింది. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మహిళలు విద్యావంతు అయి సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం మహిళా సమాఖ్య అనేక పోరాటాలు చేసిందన్నారు. మహిళా సమాఖ్య నాయకులు ప్రజలను చైతన్య వంతం చేయాలన్నారు. మహిళా సమాఖ్య నగర ప్రధాన కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు పెరిగిన నేపథ్యంలో కుటుంబాన్ని పోషించటానికి మహిళలు కూడా బయటకు వెళ్లి పని చేయాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. పని ప్రదేశాల్లో మహిళల రక్షణ కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా స్థానిక సమస్యలపై దృష్టిపెట్టి పోరాడాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ మహాసభలో నూతన ప్రధాన కార్యదర్శిగా నక్క రాజ్యలక్ష్మి, అధ్యక్షురాలుగా మందడి సామ్రాజ్యం, నూతన కమిటీగా ఓర్సు భారతి, మందాడి సామ్రాజ్యం, కే.సుమతి, అన్నామలై సక్కుబాయి, పుట్టగుంట సత్యవతి, గండికోట రాణి, పుట్టగుంట బాల, కె.వెంకటేశ్వరమ్మ, కొనతం చంద్రిక, సురాధన లక్ష్మిలను ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు డి.సితారావమ్మ, దుర్గాసి రమణమ్మ, దర్శనం పుష్పవతి, చింతాడ పార్వతి, అండిమాని నాగమణి తదితరులు పాల్గొన్నారు.

21వ డివిజన్‌లో పైప్‌లైన్‌కు శంకుస్థాపన

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : తూర్పు నియోజకవర్గంలోని 21వ డివిజన్‌లో దాదాపు రూ.80లక్షల నిధులతో పాతగుడ్ల బజార్, నిమ్మల బజార్, కొట్టు సుబ్బారావు వీధిలో చేపట్టిన సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రెయిన్‌ల నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి సోమవారం నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, నగర మేయర్ ఆర్.భాగ్యలక్ష్మితో కలిసి ముఖ్య అతిథితులుగా హాజరయ్యారు. తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ దేవినేని అవినాష్ భూమిపూజ నిర్వహించారు. రణదివె నగర్ కట్ట ప్రాంతంలో మంచినీటి మెయిన్ లైన్ మోటర్ పాడై నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో ప్రజల సూచన మేరకు నగర పాలక సంస్థ అధికారులతో మాట్లాడి రూ.8 లక్షలతో కొత్త మోటర్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి, డివిజన్ అధ్యక్షులు టీపీ.రెడ్డి నగర పాలక సంస్థ అధికారులు, వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్సిడీపై రూ.50కి టమాటా.. వినియోగదారులకు ఊరట.

విశాలాంధ్ర-కంచికచర్ల : రైతు బజార్‌లో వినియోగదారులకు సబ్సిడీపై టమాటాను అందజేస్తున్న .. రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ అజేయ కుమార్ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై టమాటాను పంపిణీ చేస్తుండడంతో వినియోగ దారులకు ఊరట లభించింది. మార్కెట్‌లో కిలో టమాటా రూ.100 పలుకుతోంది. సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేయలేక పోతున్నారు. దీంతో రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి కంచికచర్ల రైతు బజార్ లో టన్ను టమాటాను తెప్పించడం జరిగిందని. రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ అజేయ్ కుమార్ తెలిపారు.